సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 3 । మే । 2025



వణుకు పుట్టిస్తున్న చినుకు..
పుణ్యక్షేత్రం భద్రాచలంలో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపైకి వచ్చే వర్షపు నీరు వరదను తలపిస్తోంది.
10లో



చేతులు కాలకముందే..
ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు గాలిదుమారానికి కూలిపోయే స్థితికి చేరాయి.
10లో

గరిష్టం / కనిష్టం
40° / 26°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం తర్వాత ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

భద్రగిరిలో వైశాఖ మాసోత్సవాలు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో వైశాఖ మాసోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. రోజూ స్వామివారి మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకం, స్నపన తిరుమంజనం, సంధ్యా హారతి, పవళింపు సేవ, చుట్టుసేవతోపాటు తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు, తిరువీధి సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ ధర తగ్గుముఖం

తాజాగా టన్నుకు రూ.942 తగ్గుదల

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ టన్ను ధర తగ్గుముఖం పడుతోంది. తాజాగా టన్నుకు ఏకంగా రూ.942 తగ్గింది. గతేడాది డిసెంబర్‌లో టన్ను ఆయిల్‌పామ్ ధర రూ.20,506 ఉండగా, ఈ ఏడాది జనవరిలో టన్నుకు రూ.19 తగ్గింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో స్వల్పంగా పెరిగి టన్ను ధర రూ.21 వేలకు చేరింది. ఒక్కసారిగా రూ.942 తగ్గిపోవడంతో టన్ను ధర రూ.20,058గా ఖరారైంది. తాజాగా నిర్ణయించిన టన్ను ధర ఏప్రిల్ నెలకు వర్తిస్తుందని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. కాగా, ఆయిల్‌పామ్ టన్ను ధర క్రమంగా తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అంగన్‌వాడీల్లో టేక్ హోం రేషన్

వేసవి సెలవుల్లో 25 రోజులకు కలిపి పంపిణీ

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించడంతో టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రీ స్కూల్ కొనసాగుతున్న 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలున్న అంగన్‌వాడీ సెంటర్లకు పూర్తిగా సెలవులు ఇస్తున్నట్లు గురువారం తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేసిన విషయం విదితమే. సెలవులు కావడంతో మే 1 నుంచి 31 వరకు తల్లులు, పిల్లలు రాకుండా వారికి 25 రోజులకు కావాల్సిన రేషన్‌ను ఒక్కసారి అందజేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలింతలు, గర్భిణులు, 6 నెలల నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు సరుకులను టేక్ హోం రేషన్ ద్వారా అందజేస్తామని జిల్లా సంక్షేమశాఖ అధికారిణి స్వర్ణలతా లెనినా పేర్కొన్నారు.

సమ్మెకు సన్నద్ధం!

- ఈ నెల 7 నుంచి సమ్మె చేపట్టనున్న ఆర్టీసీ కార్మికులు
- ఖమ్మం రీజియన్ పరిధిలో 2,012 మంది సిబ్బంది



కొత్తగూడెం ఆర్టీసీ బస్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు(ఫైల్)

చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో మరోసారి సమ్మె సైరన్ మోగనుంది. ఈ నెల 7 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ గత నెల 7న హైదరాబాద్ లేబర్ కమిషన్ కార్యాలయంలో ప్రకటించింది. 2019లో ఆర్టీసీ కార్మికులు 54 రోజులపాటు సమ్మె చేపట్టారు. ఆ సమయంలోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేశారు. కానీ విలీన ప్రక్రియ చేపట్టలేదు. కార్మిక సమస్యలు పరిష్కరిస్తామని, పీఆర్సీ బకాయిలు చెల్లిస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ఆర్టీసీ కార్మికులు ఆరోపిస్తున్నారు. దీంతో సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి సమ్మెకు శంఖారావం పూరించాయి. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఈ ఏడు డిపోల పరిధిలో 556 బస్సు సర్వీసులు ఉండగా, 2,012 మంది వరకు ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ బకాయిల చెల్లింపుల వంటి 21 డిమాండ్లను పరిష్కరించుకునేందుకు ఆర్టీసీ కార్మికులు సమ్మెబాట పట్టబోతున్నారు.

ప్రధానమైన డిమాండ్లు ఇవే..

- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి.
- 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించాలి. కొత్త అలవెన్సు అమలు చేయాలి.
- 2021, 2025 వేతన సవరణలు అమలు జరపాలి. ఉద్యోగ భద్రత కల్పించి, సిబ్బందిపై పనిభారం తగ్గించాలి. ఎంటీడబ్ల్యూ యాక్టును అమలు చేయాలి.
- ఆర్టీసీ అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో 3 శాతం నిధులను కేటాయించాలి. సంస్థ అప్పులను టేకోవర్ చేయాలి.
- బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ కారణంగా నిరపరాధులైన డ్రైవర్లను శిక్షించొద్దు. వారిని వైద్య పరీక్షలకు పంపాలి. మహాలక్ష్మి పథకం అమలులో జరిగే తప్పిదాలకు సిబ్బందిని అక్రమంగా శిక్షించొద్దు. జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డులు ప్రవేశ పెట్టాలి.
- ఎలక్ట్రిక్ బస్సులను కేంద్రం ప్రభుత్వం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొని ఆర్టీసీకి ఇవ్వాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలి.
- కారుణ్య నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలి. ప్రస్తుతం కన్సాలిడేటెడ్ పే కింద పని చేస్తున్న వారందరినీ రెగ్యులరైజ్ చేయాలి.
- అద్దె బస్సులు, ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లను, ఇతర సిబ్బందిని, అద్దె బస్సులను ఆర్టీసీలోకి తీసుకోవాలి.
- 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తి వేయాలి. పీఎఫ్, సీసీఎస్ నుంచి యాజమాన్యం వాడుకున్న డబ్బులను వడ్డీతో సహా చెల్లించాలి.
- అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కన్సల్టెన్సీల పేరు మీద పని చేస్తున్న అధికారులను, సూపర్ వైజర్లను తొలగించి వారి స్థానాలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలి.
- గ్యారేజ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. వర్క్‌షాపులను మెరుగు పరచాలి. మహిళా కండక్టర్లతో పాటు మహిళ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి. వారికి రాత్రి 8 గంటలలోపు విధులు ముగించేలా చూడాలి.
- ఆర్టీసీలో రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు కొనాలి. స్క్రాప్ బస్సులను రద్దు చేయాలి. మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలి.

ఖాళీలను భర్తీ చేయడంలేదు



దశాబ్ద కాలంగా ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయడంలేదు. 8 గంటల డ్యూటీని 16 గంటల వరకు పెంచి కార్మికులను పని ఒత్తిడికి గురి చేస్తున్నారు. దీనివల్ల అనారోగ్యం బారిన పడుతున్నాం. ప్రధాన డిమాండ్ల సాధనకు సమ్మె చేపడుతున్నాం.

–జి.రమేష్ బాబు,డ్రైవర్

సమస్యల పరిష్కారానికే..



కార్మికులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలు చెల్లించడంతో పాటు ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 7 నుంచి సమ్మెబాట పడుతున్నాం. అనేక దఫాలుగా ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. –కందుల భాస్కర రావు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

రూట్ మార్చి..

డిజిటల్ మార్గాన లంచాల వసూళ్లు

- మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ వ్యక్తులు..
- ఏసీబీ దాడులతో పంథా మార్చిన అవినీతి అధికారులు
- 16 నెలల్లో 18 కేసులు, 26 మంది అరెస్ట్



లంచం తీసుకుంటూ పట్టుబడిన సీఐ రమేశ్, గన్‌మెన్ రామారావు, ప్రైవేట్ వ్యక్తి కార్తీక్ (ఫైల్)



అవినీతి నిరోధక శాఖ వాల్‌పోస్టర్

కొత్తగూడెంటౌన్: లంచం అడగటం కాదు ఇవ్వటం కూడా నేరం అనేది అందరికీ తెలిసిందే. కానీ, లంచం లేకుండా పనులు అవుతున్నాయా? అంటే కావట్లేదనేది కూడా బహిరంగ రహస్యమే. ఏసీబీ దాడులు లంచగొండులను భయపెడుతున్నా.. రూటు మార్చుకుని లంచం వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా లంచం తీసుకుంటున్నారు. కాగా, జిల్లాలో 2024 నుంచి 2025 ఏప్రిల్ వరకు 18 కేసులు నమోదు కాగా 26 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12,12,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఏసీబీ దాడులు ఎక్కువవడంతో ఏసీబీ డీఎస్పీ రమేశ్‌ను మార్చాలని ఒత్తిళ్లు కూడా రావడం గమనార్హం.

ప్రైవేట్ వ్యక్తుల హవా..

ఇటీవల మణుగూరుటౌన్‌లో ఓ భూవివాదంలో సీఐ సోమ సతీశ్‌తో పాటు ప్రైవేట్ వ్యక్తి గోపి (ఒక చానల్ రిపోర్టర్, సాక్షి కాదు)లు లంచం తీసుకుంటూ దొరికారు. కేసు కాకుండా ఉండేందుకు అప్పటికే రూ.3 లక్షలు తీసుకుని, మరో లక్ష తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గత మార్చి 19న బూర్గంపాడు మండలం లక్ష్మీపురం నుంచి గ్రావెల్ లారీ భద్రాచలం వచ్చింది. యజమానిని పిలిచి అనుమతులు లేవని కేసు నమోదు చేస్తామని సీఐ బెదిరించారు. మధ్యవర్తులు గన్‌మెన్ రామారావు, కార్తీక్‌లు యజమానికి చెప్పి గన్‌మెన్ సూచించిన ఫోన్ ఫోన్‌పే నంబర్‌కు రూ.20 వేలు పంపించారు. భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ బర్పాటి రమేశ్, గన్‌మెన్ (కానిస్టేబుల్) రామారావుతో పాటు ప్రైవేట్ వ్యక్తి కార్తీక్‌ను పోలీసులు పట్టుకున్నారు. 2024, ఏప్రిల్ 18న దొంగతనం కేసులో నిందితుల నుంచి లంచం తీసుకుంటూ అప్పటి భద్రాచలం ఎస్‌ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్‌తో పాటు మరో ప్రైవేట్ వ్యక్తిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇలా మధ్యవర్తుల్లాగా ప్రైవేట్ వ్యక్తులు వ్యవహరిస్తూ దొరికిపోతున్నారు.

లంచం అడిగితే పట్టుకుంటాం



లంచం అడిగితే ప్రజలు భయపడటం లేదు. ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ప్రజల్లో చైతన్యం పెరిగింది. లంచం ముట్టుకుంటే మేము పట్టుకుంటాం. ఎవరు లంచం అడిగినా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలి. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. మరింతగా అవగాహన కల్పించేందుకు పోస్టర్లను ఏర్పాటు చేశాం.

–వై.రమేశ్, ఏసీబీ డీఎస్పీ, ఖమ్మం

ఏసీబీ నమోదు చేసిన కేసుల్లో కొన్ని..

2024 నుంచి..

- జనవరి 29న ఖమ్మంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పగడాల కోటేశ్వరావు రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 18న భద్రాచలం ఎస్‌ఐ ములగండ్ల శ్రీనివాస్, ప్రైవేట్ వ్యక్తులు నవీన్, శంకర్ రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- మే 16న అశ్వారావుపేట ఎలక్ట్రికల్ ఏఈ ధరావత్ శరత్‌కుమార్ రూ.లక్ష తీసుకుంటూ దొరికాడు.
- మే 23న చర్ల నాయబ్ తహసీల్దార్ భీరవల్లి భరణిబాబు రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- జూలై 25న పాల్వంచటౌన్ ఎస్‌ఐ బాణాల రాము రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- సెప్టెంబర్ 18న జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ కుసుమ సూర్యనారాయణ రూ.1,14,000 తీసుకుంటూ పట్టుబడ్డారు.
- అక్టోబర్ 23న పాల్వం లైన్‌ఇన్‌స్పెక్టర్ జినుగు నాగరాజు రూ.26 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- అక్టోబర్ 29న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్డీ ఖలీల్‌పాషా రూ.3 లక్షలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- డిసెంబర్ 9న సీనియర్ అకౌంటెంట్ కట్టా నగేశ్ రూ.40 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఇల్లెందు మైనార్టీ రెసిడెన్సీ ప్రిన్సిపాల్ బి.కృష్ణ రూ.50 వేలతో పట్టుబడ్డారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలి

కొత్తగూడెంఅర్బన్: వేసవికాలంలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ప్రజలకు పంపిణీ చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్‌సీల ఫార్మసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాలు అన్నీ ఉండేటట్లు చూసుకోవాలని, ఆస్పత్రుల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అధికారులు తేజశ్రీ, ఫయాజ్‌మొయునిద్దీన్, నాగభూషణం, వేణుమాధవ్, రాజేష్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

70 లక్షల మొక్కలు నాటాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో ఈ సారి 70 లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి మాట్లాడారు. ఈసారి రైతులకు మొక్కలు అందించాలని, ఇంటి ఆవరణ, రహదారుల వెంట, కెనాల్ బండ్ ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ అభివృద్ధి శాఖ 30 లక్షల మొక్కలు, టీజీఎఫ్‌డీసీ శాఖ 12 లక్షలు, అటవీశాఖ 10 లక్షలు, సింగరేణి 10 లక్షలు, ఉద్యానవన శాఖ 5.7 లక్షలు, వ్యవసాయ శాఖ 5 లక్షలు, ఇరిగేషన్ 2 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాలను నిర్దేశించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు తాటి, ఈత చెట్లను నాటాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మునగ మొక్కలు, అటవీశాఖ వెదురు మొక్కలు, విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలల్లో ఔషధ మొక్కలు నాటాలన్నారు. ఇరిగేషన్ అధికారులు జిల్లావ్యాప్తంగా ఉన్న కెనాల్ బండ్ ప్లాంటేషన్‌లో సుబాబుల్, వట్టివేర్ల మొక్కలు నాటాలన్నారు. అటవీ శాఖ అధికారి కృష్ణాగౌడ్ మాట్లాడుతూ ఆసక్తి గల రైతులకు అటవీ శాఖ నర్సరీల్లో టేకు, ఎర్రచందనం, వెదురు మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, అధికారులు చంద్రమౌళి, భాస్కర్ నాయక్, కిషోర్, అర్జునరావు, శ్రీనివాసరావు, ఇందిర, తిరుపతయ్య, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పరిశీలన చేస్తున్నాం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జితేష్ హాజరై మాట్లాడారు క్షేత్రస్థాయిలో అధికారులు దరఖాస్తులను పరిశీలించి సంతకం చేయడం ద్వారానే లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. పేదలలో అతి పేదవారికి మాత్రమే లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌శర్మ, కొత్తగూడెం ఆర్డీఓ మధు, హౌసింగ్ పీడీ శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పహల్గామ్ మృతులకు న్యాయమూర్తుల సంతాపం



మౌనం పాటిస్తున్న న్యాయమూర్తులు

కొత్తగూడెంటౌన్: పహల్గాంలో ఉగ్రవాద దాడిలో మృతి చెందినవారికి జిల్లా న్యాయమూర్తులు శుక్రవారం సంతాపం తెలిపారు. కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన సంతాప కార్యక్రమంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ ఉగ్రవాద దాడి హేయమైన చర్య అని అన్నారు. ఆ తర్వాత నూతన జడ్జిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.సరిత, కె. కిరణ్‌కుమార్, ఎం.రాజేందర్, ఏ.సుచరిత, కె.సాయిశ్రీ, బి.రవికుమార్, రాజమల్లు, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జే.గోపికృష్ణ, సభ్యులు కాసాని రమేష్, కె.చిన్నికృష్ణ, ఉప్పు అరుణ్, మాలోత్ ప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'నీట్'కు పటిష్ట బందోబస్తు

- జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలు.. 1,176 మంది అభ్యర్థులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: జిల్లాలో మూడు కేంద్రాల్లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. తన కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నీట్ పరీక్షా కేంద్రాలు కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ కళాశాల, పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ (గర్ల్స్), యూనివర్శిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ వద్ద బీఎన్‌ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుందని, సీసీ కెమెరాల నిఘా ఉంటుందని వివరించారు. కొత్తగూడెం బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో పరీక్షా కేంద్రాల మార్గాలను తెలిపే క్యూఆర్ కోడ్‌లు అంటించామని, తాగునీటి, అత్యవసర వైద్య సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

ఇవీ నిబంధనలు

అడ్మిట్ కార్డులో సూచించిన నియమ నిబంధనలు పాటించాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకే అభ్యర్థులను కేంద్రాలోకి అనుమతిస్తారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు, షూస్, సాక్స్, బెల్ట్‌లు (చెవి దిద్దులు, క్లిప్‌లు, ఇతర ఆభరణాలు, తాయత్తులు, తాళ్లు) వంటివి లేకుండా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలి. అడ్మిట్‌కార్డుతోపాటు గుర్తింపు కార్డు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తమ వెంట తెచ్చుకోవాలి. పరీక్షా కేంద్రాల నుంచి 200 మీటర్ల దూరం వరకు ఎవరూ ఉండొద్దు. కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్, కంప్యూటర్ సెంటర్లు మూసివేయాలి. అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకుంటారు.

ఫలితాల్లో దమ్మపేట ఫస్ట్

- పదో తరగతిలో చివరి స్థానంలో సుజాతనగర్
- మెరుగైన ఫలితాలు సాధించిన బీసీ వెల్ఫేర్ విద్యార్థులు
- 16 వరకు సప్లిమెంటరీ ఫీజు చెల్లించే అవకాశం
- ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



దమ్మపేట జిల్లా పరిషత్ పాఠశాల

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలుర కంటే బాలికలు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారు. గత బుధవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 27వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోల్చుకుంటే జిల్లాలో 1.10 శాతం ఉత్తీర్ణత పెరిగినా రాష్ట్ర స్థాయిలో జిల్లా ఒక స్థానం కిందకు పడిపోయింది. ఐదేళ్లుగా రాష్ట్రస్థాయిలో జిల్లా ఎప్పుడూ వెనుకంజలోనే ఉంటోంది. జిల్లా విద్యాధికారులు రూపొందించిన ప్రణాళికలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే ఆరోపణలున్నాయి. రాష్ట్రస్థాయిలో జిల్లా ఎప్పుడూ 25వ స్థానం కంటే దిగువనే ఉంటోంది. గతేడాది జిల్లాలో నూతనంగా 421 మంది ఉపాధ్యాయులు కొత్తగా నియమితులయ్యారు. డీఎస్సీ–2008 నుంచి మరో 41 మంది వచ్చారు. వీరిలో అన్ని సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులున్నారు. గతంలో సబ్జెక్ట్ టీచర్ల కొరతతో ఆశించిన ఫలితాలు రాలేదు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఉన్నా, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించినా చెప్పుకోదగిన విధంగా ఫలితాలు రావడంలేదు. జిల్లాలోని దమ్మపేట మండలానికి ఫలితాల్లో మొదటి స్థానం, సుజాతనగర్‌కు చివరి స్థానం దక్కింది. వచ్చే విద్యా సంవత్సరంలోనైనా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రతిభ చాటిన బీసీ వెల్ఫేర్ విద్యార్థులు

ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ విద్యార్థులు 95.93 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఆర్‌ఈఎస్, టీడబ్ల్యూఆర్‌ఎస్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు.

పాఠశాలలు	ఉత్తీర్ణత శాతం
ఎయిడెడ్	89.62
ఆశ్రమ	94.06
బీసీ వెల్ఫేర్	95.93
ప్రభుత్వ	78.48
కేజీబీవీ	89.79
ప్రైవేటు	94.40
రెసిడెన్షియల్	91.80
మినీ రెసిడెన్షియల్	94.25
ఎస్‌డబ్ల్యూఆర్	93.88
టీడబ్ల్యూఆర్	94.06
జెడ్పీ	86.46

ప్రారంభమైన రీ కౌంటింగ్, వెరిఫికేషన్ దరఖాస్తులు

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు శుక్రవారం నుంచి ప్రారంభంకాగా, ఈ నెల 15వ తేదీ వరకు గడువు విధించారు. రీ వెరిఫికేషన్ దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాక సంబంధిత కాపీని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కూడా ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు కూడా సప్లిమెంటరీ పరీక్షలు జరుగనుండగా, ఈ నెల 16వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు విద్యాధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో గురువారం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ప్రత్యేక తరగతులపై సూచనలు చేశాం



పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓలకు, ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశాం. విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలల్లో లేదా ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహించాలని సూచించాం. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపాం.

– వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

హెచ్‌ఎంకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శంకర్

ములకలపల్లి: మండలంలోని తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం శంకర్‌కు యంగ్ ఇండియన్ సేవా పురస్కారం లభించింది. కొత్తగూడెంనకు చెందిన యంగ్ ఇండియన్ బ్లడ్‌డోనర్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం, హరిత హారం, విద్యాభివృద్ధి, మహిళా సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన అంశాల్లో సేవలందిన వ్యక్తులకు ఏటా సేవా పురస్కారాలను అందజేస్తున్నారు. అందులో భాగంగా చిన్నారుల విద్యాభివృద్ధి, దాతల సాయంతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, 100% విద్యార్థుల నమోదు అంశాలతోపాటు, పాల్వంచకు చెందిన వేచన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన సామాజిక సేవకుగాను శంకర్ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జలమండలి శాఖ (హెచ్‌ఎండబ్ల్యూఎస్), మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, కొల్లి ఫౌండేషన్ చైర్‌పర్సన్ కల్పనాచౌదరి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

అందరూ కలిసిమెలిసి జీవించాలి



మాట్లాడుతున్న ఖాలీద్ ముబష్షీర్

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో అందరూ కలిసిమెలిసి జీవించాలని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఖాలీద్ ముబష్షీర్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం మదురబస్తీలోని జమాతే ఇస్లామి హింద్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వమానవ సౌభ్రాతృత్వం సమానత్వం కోసం కులమతాలకు అతీతంగా, ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా అందరికీ సమన్యాయం అందేలా కార్యకర్తలు న్యాయ ధ్వజ వాహకులుగా నిలవాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోహేబ్ మాట్లాడుతూ.. జమాతే ఇస్లామి హింద్ ఒక స్వచ్ఛంద ధార్మిక సేవాసంస్థ అని, 75 ఏళ్ల నుంచి కుల, మత, వర్గ, వర్ణ వివక్ష లేకుండా సేవ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జమైతే ఇస్లామిక్ హింద్ కార్యదర్శి నయీముద్దీన్, జిల్లా అధ్యక్షుడు ఫారూఖ్ యజ్దానీ, షరీఫ్, జహంగీర్, అబ్దుల్ భాసిత్, షబ్బీర్ హుస్సేన్, ముజాహిద్, పర్వీన్ సుల్తానా, షేహనాజ్, ఏజాజ్, నస్రా తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ సౌత్‌జోన్ జట్టులో జిల్లావాసులు



ఎంపికైన చరణ్, అవినాష్, అనిల్‌కుమార్

ఇల్లెందురూరల్: సాఫ్ట్‌బాల్ ఆలిండియా యూనివర్సిటీస్థాయి పోటీల్లో పాల్గొనే సౌత్ జోన్ జట్టుకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. మండలంలో మస్సివాగు గ్రామపంచాయతీకి చెందిన అజ్మీర చరణ్, దుమ్ముగూడెం మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన రేసు అవినాష్, గుండాల మండలం సజ్జలబోడు గ్రామానికి చెందిన జబ్బ అనిల్‌కుమార్ కాకతీయ యూనివర్సిటీలో బీపీఈడీ ఫైనలియర్ చదువుతున్నారు. 2024 అక్టోబర్ 20వ తేదీన కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని, సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఏపీలోని నెల్లూరులో నిర్వహిస్తున్న పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు కోచ్ రామాంజనేయులు తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం



పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాజ్‌కుమార్

పినపాక: మండలంలోని ఉప్పాక గ్రామంలో శుక్రవారం క్షుద్ర పూజలు కలకలం రేపాయి. పుప్పాక గ్రామంలోని పొలంలో పూజలు చేసినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రైతు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రాజ్‌కుమార్ పరిశీలించారు. క్షుద్ర పూజలు వంటి వదంతులు, మూఢ విశ్వాసాలను ఎవరూ నమ్మొద్దని సూచించారు.

నాటుసారా పట్టివేత

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారుల కథనం ప్రకారం.. పట్టణంలోని కూనవరం రోడ్డులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులకు ఆటోలో తరలిస్తున్న 15 లీటర్ల నాటుసారా పట్టుబడింది. దానిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేశామని అధికారులు తెలిపారు.

వణుకు పుట్టిస్తున్న చినుకు..



స్లూయిజ్‌ల సమస్యతో రామాలయం వద్ద వర్షపు నీరు (ఫైల్)

అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారిస్తేనే ఫలితం..

- భద్రాచలంలో డ్రెయినేజీ అస్తవ్యస్తం..
- చినుకు పడితే రోడ్లపై పారుతున్న వరద
- అత్యాధునిక డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే డిమాండ్

భద్రాచలం: రానున్నది వర్షాకాలం.. భద్రాచలం ప్రజలను ఒక వైపు గోదావరి వరదలు భయపెడుతుంటే, మరోవైపు చిన్నపాటి చినుకులు సైతం వణికిస్తుంటాయి. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపైకి వచ్చిన వర్షపు నీరు వరదను తలిపిస్తోంది. దీంతో గోదావరినే రోడ్లపైకి వచ్చిందా అన్నట్లుంటుంది భద్రాచలంలో పరిస్థితి. దీనికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు హామీలిస్తున్నా.. అవి కార్యరూపం దాల్చటం లేదు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో జిల్లాధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తుగా మేల్కొనాలని భద్రాచలం వాసులు వేడుకుంటున్నారు.

అత్యాధునిక డ్రెయినేజీ సిస్టం అత్యవసరం

భద్రాచలంలో కొద్ది పాటి వర్షం కురిసినా రోడ్ల మీద వరద పారుతోంది. చర్ల రోడ్డు, ఉదయ్‌భాస్కర్ రోడ్డు, మిథిలా స్టేడియంతో పాటు ప్రధాన రోడ్లన్నీ ఇలాగే దర్శనమిస్తున్నాయి. శివారు కాలనీలు, చెరువు సమీప ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద చేరుతోంది. రాత్రి సమయంలో వర్షం కురిస్తే ప్రజల అవస్థలు వర్ణనాతీతం. కారణం ఇంతవరకు సిటీ మాస్టర్ ప్లాన్ లేకపోవడ, అధికారులు ఆ దిశగా కసరత్తు చేయకపోవడమే. భద్రాచలం జనాభా సుమారు లక్ష. రామయ్య దర్శనానికి వచ్చే భక్తులతో పాటు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పటిష్ట, అత్యాధునిక డ్రెయినేజీ వ్యవస్థను రూపొందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చొరవ చూపాలి..

గోదావరి వరద సంభవించినప్పుడు స్లూయిజ్‌లు మూసివేడయంతో వర్షపు నీరు గోదావరిలో కలవడం లేదు. దీంతో ఆలయ సమీపంలో ఉన్న విస్తా కాంప్లెక్స్ దుకాణాలు, నిత్యాన్నదాన సత్రంలోకే కాకుండా ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ వరద చేరుతోంది. దీనిని తోడేందుకు భారీ మోటార్లను ఏటా ఏర్పాటు చేస్తున్నారు. ఇలా కాకుండా శాశ్వత పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిదులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పుట్‌పాత్‌ల ఆక్రమణ, డ్రెయినేజీ అస్తవ్యస్తం

రాష్ట్ర విభజన అనంతరం ఐదు పంచాయతీలు ఏపీలో కలవడంతో భద్రాచలంలో స్థల సమస్య ఏర్పడింది. దీంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నివాసాలు పెరిగాయి. ఈ క్రమంలో ఖాళీ స్థలాలతో పాటుగా డ్రెయినేజీలను ఆక్రమించి మరీ నిర్మాణాలను చేపట్టారు. దీంతో పాటుగా వ్యాపార సముదాయాలు సైతం ఫుట్‌పాత్‌ల మీదుగా వెలిశాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించాల్సిన డ్రెయినేజీ వ్యవస్థను సైతం అధికారులు పక్కదారి పట్టించారు. సిటీ మాస్టర్ ప్లాన్ సైతం లేకపోవడంతో ఇష్టానురీతిగా నిర్మాణాలు సాగాయి. దీంతో పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి..



భద్రాచలంలో వర్షం కురిస్తే ప్రధాన రోడ్లు, శివారు కాలనీలు జలమయమవుతున్నాయి. దీంతో కొన్ని కుటుంబాలు నష్టపోతున్నాయి. స్లూయిజ్‌ల వద్ద వర్షపు నీరు కాలనీలను ముంచెత్తుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తలెత్తకుండా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలి.

–రావులపల్లి రాంప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకుడు

చేతులు కాలకముందే..



ఖమ్మంలోని స్టేడియం ఎదుట హోర్డింగ్‌పై చిరిగిపోయిన ఫ్లెక్సీ (ఇన్‌సెట్) సగం మేర చినిగి వేలాడుతున్న ఫ్లెక్సీలు

- ముందస్తు చర్యలు తీసుకుంటే మేలు..
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఇష్టారాజ్యంగా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు
- కొన్నిచోట్ల అనుమతికి మించి.. ఇంకొన్ని చోట్ల అనధికారికంగా ఏర్పాటు
- సంస్థల నిర్లక్ష్యంపై దృష్టి సారించని యంత్రాంగం

ఖమ్మంలోని ప్రధాన రహదారి వైరా రోడ్డుకు ఇరువైపులా భవనాలపై భారీ హోర్డింగ్‌లు ఉన్నాయి. వీటిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటివేవీ పాటించకపోవడంతో ఫ్లెక్సీలు గాలికి చిరిగి వేలాడుతున్నాయి. ఇంకొన్ని చోట్ల ఫ్లెక్సీలు ఎగిరొచ్చి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇదికాక హోర్డింగ్‌లను పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడంతో కూలిపడతాయేమోననే స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

ఖమ్మంమయూరిసెంటర్: వివిధ కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారానికి నగర, పురపాలికల్లో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. ఈ క్రమంలో నిబంధనలు విస్మరించి, అనుమతికి మించి భారీస్థాయిలో ఫ్లైఓవర్ల వెంట, ఇతర రద్దీ ప్రాంతాలు, బైపాస్‌ల వెంట భవనాలపై ఏర్పాటు చేస్తుండడంతో భారీ ఈదురుగాలులు, వర్షాల సమయాన కూలిపడతాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో హోర్డింగ్‌ల సంఖ్య నానాటికీ పెరుగుతున్నా అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

నిబంధనలు గాలికి..

వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రకటన కోసం ప్రైవేట్ యాడ్ ఏజెన్సీలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అనుమతి తీసుకుని హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం భవన బేస్‌మెంట్ పిల్లర్లతో అనుసంధానంగా పటిష్టంగా పిల్లర్ నిర్మించి రాడ్లు బిగించాలి. అంతేకాక ఫ్లైఓవర్ల పక్కన కనీసం 10 మీటర్ల దూరంలోనే ఏర్పాటుచేయాలి. భవనాలపై హోర్డింగ్‌లు ఏర్పాటుచేశాక ఏటా పిల్లర్ల బలాన్ని పరిశీలించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలు, పిల్లర్లపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంపై నిషేధం ఉంది. అంతేకాక హోర్డింగ్‌లకు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు చిరిగితే గాలిలో వేలాడకుండా తాళ్లతో బిగించాలి. సగం మేర చినిగినా, ముక్కలైనా వెంటనే తొలగించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా ఈ నిబంధనలు పాటించడం లేదు.

పోటాపోటీగా ఏర్పాటు

ఉమ్మడి జిల్లా వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతోంది. కొత్తగా పలు సంస్థల బ్రాంచ్‌లు ఏర్పాటవుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో వీటి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వీటి మధ్య పోటీ కారణంగా జనాన్ని ఆకట్టుకునేందుకు ఒకరికి మించి ఒకరు భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ హోర్డింగ్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని చూస్తున్న అధికారులు నాణ్యతను మాత్రం పట్టించుకోవడం లేదు.

వీటికే అనుమతులు..

ఖమ్మంలో సుమారు 300 వరకు హోర్డింగ్‌లు ఉన్నట్లు అంచనా. అయితే, అధికారికంగా 240 హోర్డింగ్‌లకే అనుమతి ఉంది. సత్తుపల్లిలో 25 వరకు హోర్డింగ్‌లుంటే 14కు, మధిరలో 14 ఉండగా.. నాలుగింటికే అనుమతి ఉంది. అలాగే, వైరాలో 20 హోర్డింగ్‌లు ఉండగా పన్నులు విధించిన దాఖలాలు లేవనే చెప్పాలి. ఏదులాపురంలో మూడు హోర్డింగ్‌లు ఉండగా దేనికీ అనుమతి లేనట్లు సమాచారం. కొత్తగూడెం మున్సిపాలిటీలో 25 హోర్డింగ్‌లు ఉండగా 16కు మాత్రమే అనుమతులు ఉన్నాయి. పాల్వంచలో ప్రధాన రహదారుల వెంట 15 హోర్డింగ్‌లు కనిపిస్తుండగా అన్నింటికీ అనుమతులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇల్లెందులో ఏడు హోర్డింగ్‌లకు గాను అన్నింటికీ అనుమతులు ఉన్నాయని రికార్డులు చెబుతున్నాయి. కానీ ఈ రెండు చోట్ల అనధికారికంగా పెద్దసంఖ్యలో హోర్డింగ్‌లు ఏర్పాటైనా అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇక మణుగూరులో రెండు హోర్డింగ్‌లకు గాను దేనికీ అనుమతి లేకపోవడం గమనార్హం.



అశ్వారావుపేటలో ఇటీవల గాలిదుమారానికి కూలిన హోర్డింగ్

అశ్వారావుపేటలో మూడు హోర్డింగ్‌లు ఏర్పాటు చేయగా.. ఒక హోర్డింగ్ రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. మిగిలినవి పోలీస్ స్టేషన్ వద్ద, టెలిఫోన్ ఎక్స్ఛేంజి వద్ద ఉన్నాయి. ఇటీవల భారీ గాలిదుమారానికి టెలిఫోన్ ఎక్స్ఛేంజి వద్ద భవనంపై ఉన్న హోర్డింగ్ పడిపోయింది. అయితే, ఆ హోర్డింగ్ రాడ్లు భవనంపైనే ఆగడంతో ప్రమాదం తప్పింది.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



సింథటిక్ ట్రాక్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి
- ఖమ్మం స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మం స్పోర్ట్స్: ఏ రంగంలోనైనా అభివృద్ధి ఒక్కరితో సాధ్యం కాదని, సమష్టి కృషి కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్, టేబుల్ టెన్నిస్ హాల్ నిర్మాణానికి శుక్రవారం ఆయన ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో శంకుస్థాపన చేశాక మాట్లాడారు. పటేల్ స్టేడియంలో శిక్షణ పొందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని.. వారికి మరిన్ని సౌకర్యాలు సమకూర్చేలా కృషి చేస్తానని తెలిపారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ 8.50 కోట్లు, టేబుల్ టెన్నిస్ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కాగా, క్రికెట్ శిక్షణకు 20 ఎకరాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ సింథటిక్ ట్రాక్‌తో క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందుతుందని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి మాట్లాడగా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా శంకరయ్య, కె.క్రిస్టోఫర్‌బాబు, కోచ్‌లు, క్రీడాసంఘాల ప్రతినిధులు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, సున్నా రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, షఫీక్ అహ్మద్, కర్నాటి వీరభద్రం, చంద్రశేఖర్, ఆదర్శ్‌కుమార్, వీవీఎస్.మూర్తి, ఎం.డీ.మతిన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం కప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంత్రి, ఎంపీ పతకాలు అందజేయగా.. వేసవి శిబిరంలో బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు అసోసియేషన్ తరఫున టీషర్ట్‌లు అందించారు.

డీడీఎన్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్: ధూప దీప నివేదన(డీడీఎన్) పథకానికి అర్హత కలిగిన ఆలయాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాలకు ఈ పథకాన్ని వర్తించేలా నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తులను శాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని అవసరమైన ధ్రువపత్రాలను జతపరిచాక ఈనెల 24వ తేదీ నాటికి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్‌కు అందించాల్సి ఉంటుంది. ఆతర్వాత అర్హత సాధించిన ఆలయానికి నెలకు రూ.4వేలు ధూపదీప నైవేద్యం కోసం, అర్చకుడికి రూ.6 వేల గౌరవ వేతనం చెల్లిస్తారు. కనీసం పదిహేనేళ్ల క్రితం నిర్మించి, దేవాదాయ చట్ట ప్రకారం రిజిస్టర్ కావడంతో పాటు అర్చకుడి ద్వారా నిత్యపూజలు జరుగుతున్న ఆలయాలను పరిగణనలోకి తీసుకుంటారు. మున్సిపల్ కార్పొరేషన్ కాకుండా గ్రామాలు, మున్సిపాలిటీల్లోని ఆలయాలకే వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో డీడీఎన్ పథకాన్ని ప్రారంభించగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 450 దేవాలయాలు ప్రస్తుతం జాబితాలో ఉన్నాయి.

హారన్ ఎందుకు కొట్టావన్నందుకు దాడి

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి చెందిన సోంపోగు కోటేశ్వరరావుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. గ్రామానికి చెందిన కొమ్ము వెంకటనారాయణ ఇంటి వద్దకు గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్లిన కోటేశ్వరరావు హారన్ కొట్టాడు. శబ్దం ఎందుకు చేస్తున్నావని ప్రశ్నించగా వెంకటనారాయణను అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టి చంపుతానని బెదిరించాడు. అడ్డొచ్చిన ఇంకొందరిని కూడా దూషించడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వరిగడ్డి వామి దగ్ధం

తల్లాడ: మండలంలోని తెలగవరంలో శుక్రవారం సర్వీస్ వైరు తెగిపడి నిప్పంటుకోవడంతో వరిగడ్డి వామి దగ్ధమైంది. భూక్యా నాగు ఇంటి వద్ద 400 కట్టలతో కూడిన గడ్డి వామిపై సర్వీస్ వైరు తెగి పడడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పుతూనే వైరా అగ్నిమాపక శాఖ కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే రూ.50 వేల విలువైన గడ్డి కాలిపోయిందని బాధిత రైతు నాగు తెలిపాడు.

ఆర్‌ఓబీపై బస్సు, లారీ ఢీ

మధిర: మండలంలోని దెందుకూరు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఎదురెదురుగా వచ్చిన బస్సు, లారీ ఢీకొన్నాయి. మధిర నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న మధిర డిపో ఆర్టీసీ బస్సును, ఎర్రుపాలెం నుంచి మధిర వైపుకు వస్తున్న సుబాబుల్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకున్నా, కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లారీడ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మధిర రూరల్ పోలీసులు తెలిపారు.

సింగరేణిలో రూ.5లక్షల విలువైన కాపర్ వైరు చోరీ

పక్కా సమాచారంతో పట్టుకున్న సిబ్బంది

కారేపల్లి: సింగరేణి సంస్థలో చోరీ చేసిన కాపర్‌వైరును వాహనంలో తరలిస్తుండగా సంస్థ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. కారేపల్లి మండలంలోని సోలార్ ప్లాంట్ వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇల్లెందులో పాత ఇనుప సామగ్రి దుకాణం నిర్వహిస్తున్న ఓ జాతీయ పార్టీ నాయకుడి బొలేరో వాహనంలో శుక్రవారం రూ.5 లక్షల విలువైన కాపర్ వైర్ ఖమ్మం వైపు తీసుకెళ్తున్నారు. కొన్నాళ్ల కిందట ఈ వైరు చోరీ కాగా, సదరు దుకాణంలోనే ఉందని సంస్థ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో కాపు కాసిన వారు వాహనంలో తరలిస్తుండగా అడ్డుకుని వాహనం, వైర్‌ను కారేపల్లి పోలీసులకు అప్పగించారు. దీంతో సదరు షాప్ యజమానితో పాటు ఇంకొకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే, కాపర్ వైర్‌ను సదరు షాపు బాధ్యులే చోరీ చేయించారా, లేక ఎవరైనా చోరీ చేసి విక్రయించారా అన్న కోణంలో విచారణ నిర్వహిస్తున్నారు.

చోరీపై కేసు నమోదు

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో జరిగిన చోరీపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతుండగా సామగ్రిని అక్కడే ఉంచారు. గురువారం సాయంత్రం సిబ్బంది విధుల అనంతరం ఇంటికి వెళ్లి, శుక్రవారం ఉదయం రాగా రూ.40,000ల విలువైన విద్యుత్ సామగ్రి కనిపించలేదు. సబ్ స్టేషన్ ఏఈ రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఏపీ వాసి అదృశ్యం

చింతకాని: ఏపీలోని గుంటూరు జిల్లా తాటికొండ మండలం బండారుపల్లికి చెందిన పి.గోపి కానరాకుండా పోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. బండారుపల్లికి చెందిన శ్రీను తన భార్య, కుమారుడు గోపితో కలిసి నేరడలో మామిడి తోట కాపలాకు రెండు నెలల క్రితం వచ్చారు. మతిస్థిమితం సక్రమంగా లేని గోపి గతనెల 24న బయటకు వెళ్లి తిరిగి రాకపోగా, ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసును ఆశ్రయించారు.

అత్తపై దాడిచేసిన కోడలు, కొడుకు అరెస్ట్

అశ్వాపురం: గత నెల 29న మండలంలోని గొందిగూడెం గ్రామంలో వాసం ఈశ్వరమ్మ ఆమె అక్క ఊర్మిళపై నిప్పు కట్టె, వేడినీళ్లతో దాడి చేసిన ఘటనలో ఈశ్వరమ్మ కొడుకు సతీశ్, కోడలు నవీనను అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిద్దరినీ రిమాండ్‌కు తరలించామని, తల్లిదండ్రులు, పెద్దలపై దాడి చేసినా, వేధించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

నిప్పులో పడి మహిళకు తీవ్రగాయాలు

పాల్వంచరూరల్: చెత్త తగలబెడుతుంటే ప్రమాదవశాత్తు అందులో పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన కొత్తూరులో చోటుచేసుకుంది. మండలంలోని ఉల్వనూరు గ్రామ పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన కాలం సర్సమ్మ కుమార్తె కనకమ్మ గురువారం సాయంత్రం ఇంటి వద్ద చెతాచెదారాన్ని తగలబెడుతున్న సమయంలో ఫిట్స్ వచ్చి అందులో పడింది. స్థానికులు గమనించి కనకమ్మను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య



మూడు భీముడు (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు గ్రామ పంచాయతీకి చెందిన మూడు భీముడు (55) శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాది కిందట అనారోగ్యంతో అతని భార్య దీదీ మృతి చెందడంతో మనస్తాపానికి గురైన భీముడు.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు. భీముడుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కామేపల్లి: మరో కొద్దిరోజుల్లో వివాహం జరగాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని బాసిత్‌నగర్‌కు చెందిన సుతారి మేస్త్రీ అద్దంకి కోటేశ్వరావు(28)కు ఇటీవల ఓ యువతితో పెళ్లి నిశ్చ యం కాగా, త్వరలో నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈక్రమాన శుక్రవారం ఆయన ద్విచక్రవాహనంపై జాస్తిపల్లి మీదుగా లింగాల వైపు వెళ్తుండగా జూ లూరుపాడు మండలం కర్రివారిగూడెం గ్రామానికి చెందిన ఎం.వినోద్‌కుమార్ అశోక్ లైలాండ్ ఆటో ట్రాలీతో ఎదురుగా ఎదురుగా అతి వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ఈఘటనలో కోటేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కాగా 108లో ఖమ్మం తరలిస్తుండగానే మృతి చెందాడు. ఈమేరకు కుటుంబంలో విషాదం నెలకొనగా, ఆయన తల్లి ఉప్పలమ్మ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న జేసీబీ డ్రైవర్ మృతి

నేలకొండపల్లి: రైస్ మిల్లులో బూడిద తొలగించే క్రమాన ప్రమాదానికి గురైన జేసీబీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేలకొండపల్లి మండలంలోని ఓ రైస్ మిల్లులో గత నెల 19న బూడిదను పక్కకు నెడుతుండగా డ్రైవర్ ఉపేందర్ అందులో పడ్డాడు. వేడి కారణంగా గాయాల పాలన ఆయనను ఖమ్మంకు, ఆపై హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులతో మిల్లు యాజమాన్యం చర్చలు జరిపినట్లు తెలిసింది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మధిర: మండలంలోని వంగవీడు శివారులో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి ఆధ్వర్యాన శుక్రవారం తనిఖీ చేపట్టగా పేకాట ఆడుతున్న ఇద్దరు పట్టుబడ్డారు. ఒక బైక్, ఫోన్, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకోగా నిందితులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది కోట ధర్మ, శంకర్ పాల్గొన్నారు.